# వంట రాని కోడలు!

## -శ్రీమోహనహరి

శరత్ ధనలక్ష్మిని చూశాడు. ధనలక్ష్మి శరత్‌ని చూసింది. కళ్ళు కళ్ళు కలిసాయి. లవ్ ఎట్ ఫస్ట్ సైట్!

ఇద్దరూ బిర్లామందిర్ చూశాక బిర్యానీ తిన్నారు. చార్మినార్‌కెళ్ళి చాయ్‌లు తాగారు. పార్కుల్లో కూర్చుని పానీ పూరీలు తిన్నారు.

అలా అలా వాళ్ళిద్దరు పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.

''శరత్! నాకు వంట చేయడం రాదు. కనీసం కాఫీ, టీలు ఎలా తయారు చేస్తారో కూడా తెలీదు'' అన్నది ధనలక్ష్మి అతని గుండెలమీద తలాన్చి.

శరత్‌కి జాలేసింది. ఆమెని మరింత దగ్గరకు లాక్కున్నాడు.

''ధనూ! నేను ప్రేమిస్తున్నది నిన్ను. నీ వంటని కాదు. నువ్వెట్లా వండినా అది నాకు అమృతంలా ఉంటుంది...'' అని హామీ ఇచ్చాడు. ధైర్యం చెప్పాడు.

వెంటనే ఇద్దరు లవ్ మేరేజ్ చేసుకున్నారు.

శరత్ తరఫువాళ్ళు ''కొంప ముంచేశాడు. కనీసం రెండు మూడు లక్షల కట్నం వచ్చేది...'' అంటూ అలిగి కూర్చుండిపోయారు.

ఇహ వధువు తరఫువాళ్ళు -పిదపకాలం. పిదపబుద్ధులు. దొరసానిలా దొంగచాటున పుస్తె కట్టించుకుందని, ఉక్రోషంతో దూరంగా ఉండిపోయారు.

కొత్తలో వాళ్ళిద్దరికీ యీ లోకమే కనిపించలేదు. శరత్ పదిరోజులు సెలవు పెట్టేశాడు.

సెలవుల్లో ఉన్నన్ని రోజులు హోటల్లో తినడం ఆ తర్వాత పడక గదిలో రాసక్రీడలు!

ధనలక్ష్మి పడక గదిలోకెళ్ళింది గానీ వంటగదిలోకి మాత్రం వెళ్ళలేదు.

ఒక శుభ సమయంలో తనకే బుద్ధిపుట్టి టమాట కూర వండింది. ప్రెషర్ కుక్కర్లో అన్నం వండింది.

ఆమె చేతి వంటని రుచి చూశాక శరత్ బెంబేలు పడిపోయాడు. భళ్ళున వాంతి చేసుకోబోయి తమాయించుకున్నాడు.

ఆ కూర కలిపిన అన్నం కుక్కకి వేస్తే అది వాసన చూసి మూతిని జాడిస్తూ దూరంగా పారిపోయింది.

ఇహ గత్యంతరం లేక శరత్ వంట చేయడం మొదలెట్టాడు. అటు బ్యాంకులో డబ్బు మనిషి! ఇటు ఇంట్లో వంట మనిషి! వంట నేర్చుకోమని ధనలక్ష్మితో గట్టిగా చెప్పలేకపోయాడు.

ఆరుమాసాల తర్వాత-ఆరోజు శరత్ బ్యాంకుకెళ్ళాడు.

ధనలక్ష్మి మేక్సీ వేసుకుని టేప్ రికార్డర్ ఆన్ చేసింది. ఆమెకి పాటలంటే చాలా ఇష్టం. ఆ పాటలకి అనుగుణంగా డ్యాన్స్ చేయడమంటే మరీ ఇష్టం.

''తూ ఛీజ్ బడీ హై మస్త్! మస్త్!!'' ధనలక్ష్మి మంచి మూడ్‌లో డాన్స్ చేస్తోంది. అప్పుడు వచ్చాడు-పోస్ట్‌మేన్!

ధనలక్ష్మి ఉత్తరం చదివింది. మళ్ళీ మళ్ళీ చదివింది. ఆమెకి ఒక వైపు సంతోషంగా ఉంది. మరోవైపు భయంగానూ ఉంది.

సాయంత్రం శరత్ రాగానే ఉత్తరాన్ని అతని చేతికందించింది.

శరత్ ఉత్తరం చదివాడు. హుషారుగా ఈలవేశాడు. ఆ తర్వాత వంట విషయం గుర్తుకొచ్చి నెత్తిమీద టవల్ వేసుకుని కూర్చున్నాడు.

శరత్ దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

ధనలక్ష్మి అతనికెదురుగా కూర్చుంది. టెన్షన్ భరించలేక పెంచుకున్న చేతిగోళ్ళు కొరకడం మొదలెట్టింది.

తన తల్లిదండ్రులు వస్తున్నారు. అంటే వాళ్ళకి తన మీదున్న కోపం పోయినట్లే! అంతవరకు బాగానే ఉంది. కానీ వాళ్ళకి ఇలా మేక్సీలు వేసుకుని తిరగటం ఏమాత్రం ఇష్టముండదు. వాళ్ళుండేది పూర్తిగా పల్లెటూరి వాతావరణం.

శరత్ ధనలక్ష్మిని హెచ్చరించాడు. చక్కగా చీరకట్టుకోవాలి. వాలుజడ వేసుకోవాలి. పొద్దున్నే లేచి స్నానం చేసి పూజాగదిలోకెళ్ళాలి. నుదుట కుంకుమ బొట్టు పెట్టుకోవాలి.

శరత్ అన్న మాటలన్నింటికీ మనస్ఫూర్తిగా తలూపింది ధనలక్ష్మి.

వాళ్ళెప్పుడొస్తున్నారు? బుధవారం. అంటే మధ్యలో ఒక్కరోజు మాత్రమే ఉంది. వాళ్ళొచ్చాక ఎలా మేనేజ్ చేయాలి? కోడలు వంట చేయకపోతే తన తల్లి సావిత్రమ్మ ఏమాత్రం వూరుకోదని శరత్‌కి తెలుసు. మరెలా?

శరత్ అటూ ఇటూ తిరిగాడు. కాసేపు కూర్చున్నాడు. మరి కాసేపు జుట్టుపీక్కున్నాడు. ముందే తన తల్లిదండ్రులు మంచి భోజన ప్రియులని అతనికి తెలియని విషయం కాదు.

శరత్‌కి ఉన్నట్లుండి ఒక బ్రహ్మాండమైన అయిడియా తట్టింది.

వెంటనే వారం రోజులు లీవ్ పెట్టేశాడు.

''చూడూ! వంట సంగతి నేను చూసుకుంటాను. నువ్వు మాత్రం మా అమ్మ ముందు వంటగదిలోకెళ్ళు. వంట చేస్తున్నట్లు గిన్నెలు, ప్రెషర్‌కుక్కర్ వగైరాల శబ్దం వినిపిస్తూ ఉండు. జాగ్రత్త. ఏమాత్రం అశ్రద్ధ చేసినా మనం పట్టుబడిపోతాం'' అన్నాడు శరత్.

బెదురుబెదురుగా తలూపింది ధనలక్ష్మి.

బుధవారం రోజు రైల్వేస్టేషన్‌కి బయలుదేరేముందు టిఫిన్, టీ తయారు చేసేశాడు. ఎందుకైనా మంచిదని మధ్యాహ్నం భోజనం కోసం వెజిటేబుల్ బిర్యానీ కూడా వండేశాడు. వాళ్ళొస్తే కేవలం వేడి చేసి వడ్డించటమే ధనలక్ష్మి వంతు.

వెళ్ళేముందు పదిసార్లు చెప్పిందే చెప్పాడు శరత్.

బదులుగా ఇరవైసార్లు తలూపింది ధనలక్ష్మి.

అత్తమామలు వచ్చేసరికి ధనలక్ష్మి నిండుగా చీర కట్టుకుంది. కాళ్ళకి పట్టగొలుసులు వేసుకుంది. వాల్జెడ వేసుకుని గులాబీ పువ్వు పెట్టుకుంది. పూజగదిలో సాంబ్రాణి ముక్కలు అంటించింది. నుదుట కుంకుమబొట్టు పెట్టుకుంది.

వాళ్ళు ఇంట్లోకి రాగానే కాళ్ళకి నమస్కారం చేసింది. సిగ్గూ, భయంతో తలొంచుకుని నిల్చుంది. రవ్వంత భయంతో కాలిబొటన వేలితో నేలకేసి రాస్తోంది.

సావిత్రమ్మ కోడలని ఎగాదిగా చూసింది. మామగారు కూడా చూస్తున్నారని ధనలక్ష్మి గమనించింది. టెన్షన్‌తో ఆమె కాళ్ళు వణుకుతున్నాయి.

సావిత్రమ్మ అకస్మాత్తుగా ధనలక్ష్మిని కౌగలించుకుంది. మంచి కోడలు దొరికినందుకు ఆనంద భాష్పాలు రాల్చింది.

అప్పుడు ధనలక్ష్మికి నిజంగానే ఏడుపొచ్చింది. వాళ్ళమ్మ గుర్తుకొచ్చింది. అత్తగారిలో అమ్మ కనిపించింది. అందుకే మరింత బిగ్గరగా వాటేసుకుని వెక్కిళ్ళు పడుతూ ఏడ్చేసింది.

శరత్ 'హమ్మయ్య!' అంటూ నిట్టూర్పు విడిచాడు.

అత్తమామలు స్నానం ముగించేసి హాల్లోకొచ్చి కూర్చున్నారు.

ధనలక్ష్మి టీ తీసుకొస్తానని వంటగదిలోకి వెళ్తుంటే మామగారు ''అమ్మాయ్! ప్రయాణంలో టీలు తాగి తాగి నోరంతా వగరైపోయింది. నాకు కాఫీ పట్రా'' అనేశారు.

ఆ ఒక్కమాట విని ధనలక్ష్మి బెదిరిపోయింది. వణికిపోయింది.

శరత్ కూడా బెంబేలు పడిపోయాడు.

''నాన్నా! మంచినీళ్ళు తాగొస్తాను'' అంటూ లేవబోయాడు.

''ఒద్దు కూర్చో, అమ్మాయి తీసుకొస్తుందిలే..''

''లేదు, లేదు నాన్నా! నేనే వెళ్లి తాగొస్తాను. పొద్దున్న నాలుక సరిగ్గా గీక్కోలేదు..'' మరోమాట వినిపించుకోకుండా వంటగదిలోకి దూరాడతను.

ముచ్చెమటలతో తడిసిపోయి పిట్టలా వణికిపోతున్న ధనలక్ష్మివైపు సానుభూతితో చూశాడు. గబగబా కాఫీ తయారు చేసే విధానం చెప్పి మళ్ళీ తండ్రి పక్కన వచ్చి కూర్చున్నాడు.

భయంలో ఒక్కోసారి జ్ఞాపకశక్తి బాగా పనిచేస్తుందేమో!

ధనలక్ష్మి చక చకా కాఫీ తయారు చేసింది. టీ వేడి చేసింది.

టిఫిన్‌తోబాటు కాఫీ, టీలతో వాళ్ళిద్దరు సంతృప్తిపడ్డారు.

అత్తాకోడళ్ళు రెండు గంటల దాకా ముచ్చట్లు పెట్టుకున్నారు.

సావిత్రమ్మ మధ్యాహ్నం భోజనం చేస్తూ ''ఎంత రుచి? ఎంత రుచి? నా చిన్న కోడలు ఇంత మంచి వంట చేస్తుందనుకోలేదు. మిగతా ఇద్దరు కోడళ్ళున్నారు. ఎందుకూ? వాళ్ళకి వంటా వార్పులో శ్రద్ధ ఉంటేగా?! బిర్యానీ చాలా బాగా చేశావు'' అని పొగడు తుంటే బలవంతంగా ముఖంలో నవ్వు తెచ్చు కుని నవ్వేసింది ధనలక్ష్మి.

ఇహ రాత్రి భోజనం ఎలా? భార్యాభర్తలిద్ద రికి భయం పట్టుకుంది.

''కనీసం పూరీలు, చపాతీలు నేర్చుకుంటే బాగుండేది..'' అనేశాడు శరత్.

''అదిగో. ఆ మాటే వద్దు. నేను ముందే చెప్పాను. నాకు వంట రాదని..'' ధనలక్ష్మి కళ్ళల్లో కావేరీనది ఉరకలు వేసింది.

''సర్లే..సర్లే. ఇప్పుడు ఏడ్వటం మానేసి పరిష్కారం ఆలోచించు..'' అన్నాడు.

శరత్ మళ్ళీ అటూ ఇటూ పచార్లు చేశాడు.

పరిష్కారం దొరికింది.

పడగ్గదిలో డబుల్‌కాట్ బెడ్‌లను ఎడం చేశాడు. కూలర్ ఆన్ చేశాడు.

తల్లిదండ్రుల్ని కాస్త రెస్ట్ తీసుకోమని బల వంతం చేశాడు. సుష్టుగా భోం చేశాక వాళ్ళకి నిద్ర ముంచుకొచ్చేసింది. వాళ్ళిద్దరు గురకలు పెడుతూ నిదురపోతుంటే శరత్ హడావుడిగా వంటగదిలోకి దూరాడు. మొదట పూరీలు చేశాడు. స్వీట్స్ చేశాడు. ఆ తర్వాత ఆదరాబా దరాగా బజారుకెళ్ళాడు. చికెన్ తీసుకొచ్చాడు. కాస్త ఫ్రై చేసి మరికాస్త దానితో చికెన్ బిర్యానీ వండేశాడు.

ఆ రాత్రి మళ్ళీ సావిత్రమ్మ పొగడ్తలు మొదలెట్టింది. ''కోడలంటే ఇలా ఉండాలి. మంచి అందం, మంచి గుణం, మంచి వంట చేసే సత్తా. అన్నీ ఉన్నాయి. నేనేమో అనుకు న్నాను ఫర్వాలేదు.'' అంటూ ధనలక్ష్మిని దగ్గ రకు తీసుకుంది.



ధనలక్ష్మి సిగ్గుపడుతూ అత్తగారి ముఖంలో చూసింది.

సావిత్రమ్మ ధనలక్ష్మి కళ్ళల్లోకి సూటిగా చూసింది.

ఆ చూపులో అర్థంకాని విషయమేదో ఉందని ధనలక్ష్మి గమనించింది.

ఏమైతేనేం ఆరోజు సవ్యంగా గడిచిపోయింది.

మరుసటి రోజు శరత్ తల్లిదండ్రుల్ని ఆటోలో కూర్చోబె ట్టుకుని హైదరాబాద్ అంతా చూపించాడు. పై నుంచీ మాంచి వర్షం.

మధ్యాహ్నం లంచ్. రాత్రి డిన్నర్ ఒక ప్రముఖ హోటల్లో అరేంజ్ చేసేశాడు. అలా ఆరోజు కూడా అవిఘ్నంగా గడిచి పోయింది.

ఇహ మరుసటి రోజుంది అసలైన రోజు. సావిత్రమ్మ వంటగదిలోకి దూరి బయటకు రావడం లేదు. కోడలు భయం భయంతో వంట గదిని సర్దుతుంటే పల్లెటూరి విష యాలు చెబుతోంది.

ధనలక్ష్మికి గుబులు పుట్టుకొస్తోంది. ఆమె అక్కడే ఉంటే తను ఆమె ముందు వంట చేయాలి. వంట చేయలేదు. వంట చేయడం రాదని చెప్పడానికి ధైర్యం లేదు.

ధనలక్ష్మి సర్దిన సామాన్లే సర్దుతుంది.

శరత్ తండ్రితో మాట్లాడుతున్నాడు. మైండ్ మాత్రం కంప్యూటర్‌లా మరో విషయం ఆలోచిస్తోంది. తప్పదు. ఏదో ఒకటి చేయాలి. లేకపోతే రెండు రోజుల శ్రమంతా వృధా అయిపోతుంది.

శరత్ నవ్వు మొఖం పెట్టి మెల్లిగా లేచాడు. ఏదో పుస్తకం కోసం వెళ్ళినట్లు పడక గదిలోకెళ్ళాడు. హడావుడిగా ఒక నెంబర్ డయల్ చేశాడు.

''హల్లో! నేను ఫలానా వీధిలోని ఫలానా నెంబర్ ఇంట్లో నుంచి మాట్లాడుతున్నాను. మీరు వెంటనే ఆరు ప్లేట్ల మటన్ కుర్మా, వైట్‌రైస్ పంపించండి. చాలా అర్జంటు. కానీ ముందు ద్వారం నుంచీ తీసుకురావద్దు. వెనక దారి నుంచీ తీసుకురావాలి. ఇది మాత్రం మరచిపోకండి. ఆ, బైదిబై రాత్రికి సరిగ్గా ఎనిమిది గంటలకు తందూరి రొట్టెలు..చికెన్ ఫ్రై కూడా అరేంజ్ చేయాలి..ఏమిటీ..ఆఆ..కరెక్ట్. రాత్రికి మాత్రం ఎనిమిది ప్లేట్లు. వెనకదారి నుంచీ పంపించాలి. ఓ.కే..'' అనేసి ఫోన్ పెట్టేశాడు.

చేతికి దొరికిన ఫైలు పట్టుకుని హాల్లోకొచ్చాడు. తండ్రి టీవీ చూస్తున్నాడు. శరత్ సరిగ్గా సోఫా దగ్గరికి వచ్చి దబ్బున కింద పడిపోయాడు.


తండ్రి హడలిపోయాడు. కేకలేస్తూ భార్యని కోడల్ని పిలి

పించారు-వంటగదిలోంచి.

సావిత్రమ్మ భయపడిపోయింది. ''ఏమైందిరా నీకు? ఒరే కన్నా! ఏమైందిరా'' అంటూ ఏడ్వడం మొదలెట్టింది.

శరత్ గట్టిగా కళ్ళు మూసుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. అయినా రెప్పచాటునున్న కనుగుడ్లు కదులు తున్నాయి.

ధనలక్ష్మి అర్థం చేసుకుంది. అత్తమామలతో కలిసి శరత్‌ని బెడ్‌మీదకి తీసుకెళ్ళి పడుకోబెట్టింది. మెల్లిగా ఫ్రిజ్ నీళ్ళు తెచ్చి త్రాగించింది.




శరత్ నీరసంగా కళ్ళు తెరుస్తున్నట్లు తెరిచాడు. భార్యని చేత్తో సైగ చేసి చెవిలో మెల్లిగా ''నాకేం కాలేదు. రెండు పూటలు ఫలానా హోటల్ వాళ్ళు లంచ్, డిన్నర్ పెరటి దారి నుంచీ తీసుకొస్తారు. నువ్వు అది చూసుకో. నేను వీళ్ళని మేనేజ్ చేస్తాను..'' అని వెంటనే నీరసంగా మూలుగుతూ కళ్ళు మూసుకున్నాడు.

''అబ్బాయి ఏం చెప్పాడమ్మా?..'' గద్గదకంఠంతో అడిగింది సావిత్రమ్మ.

ధనలక్ష్మి సమయస్ఫూర్తితో అత్తగారిని కౌగిలించుకుంది.

''నాకేం కాలేదు నువ్వు అమ్మా నాన్నలకి మంచి వంట చేసి పెట్టుమని చెబుతున్నారత్తయ్యా'' అంది.

సావిత్రమ్మ చీరకొంగుతో కళ్లు తుడుచుకుంది.

ధనలక్ష్మి కాసేపు అక్కడే వుండి వంట గదిలోకెళుతుంటే తోడుగా సావిత్రమ్మ వెళ్ళబోయింది.

శరత్ చటుక్కున కళ్ళు తెరిచి ''అమ్మా! తను వంట సంగతి చూసుకుంటుంది. మీరిద్దరూ నా దగ్గర కూర్చోండి చాలు.'' అన్నాడు.

కొడుకు మాటలకి కాదనలేక వాళ్ళిద్దరు శరత్ ప్రక్కన కూర్చున్నారు.

శరత్ సావిత్రమ్మ చేయందుకుని ''ఇది నాకు మామూలే. ఆఫీస్ పని ఎక్కువైతే బీపీ పెరిగి కళ్ళు తిరుగుతాయి. అంతే. రేపు మీరిద్దరూ వెళ్ళిపోతున్నారు కాబట్టి ఈ రోజంతా నా ప్రక్కనే కూర్చోండి. కబుర్లు చెప్పుకుంటే కాలం గడిచిపోద్ది, కంగారు తగ్గుతుంది..'' అన్నాడు.

ధనలక్ష్మి వంటగదిలో వంట సామాన్లను కావాలని అటూ ఇటూ కదిలిస్తూ శబ్దం చేస్తోంది.

మరుసటి రోజు అత్తమామలు అయిష్టంగా ఆటోలో కూర్చున్నారని ధనలక్ష్మి గమనించింది. పాపం అనిపించింది. కాని తప్పదు. కొంతకాలం దూరంగానే ఉండాలి. తను వంట నేర్చుకోవాలి అని మనసులో అనుకుంది గట్టిగా.

శరత్ వాళ్ళిద్దరిని ఆటోలో తీసుకెళ్ళాక ధనలక్ష్మి డోర్ మూసేసింది. చీర విప్పి అస్తవ్యస్తంగా పారేసింది. మేక్సీ వేసుకుంది. టేప్ రికార్డ్ ఆన్ చేసి డాన్స్ చేయసాగింది. ఆ ఒక్క గంటలో ఇల్లంతా గంతులేసింది. బెడ్ మీద దొర్లింది. వాలు జడని తీసేసి పోనీ టెయిల్ వేసుకుంది.

సడన్‌గా కాలింగ్ బెల్ మోగింది.

''కమాన్! శరత్ డార్లింగ్..'' అంటూ డోర్ తెరిచింది.

ఎదురుగా అత్తమామలు! వాళ్ళ వెనకాల బిక్కమొహమేసుకున్న శరత్!

ధనలక్ష్మి కళ్ళు గిర్రున తిరిగాయి. ఒళ్ళు గడగడ వణికిపోయింది.

''ఏం కోడలా! లోపలికి రానిస్తావా?'' అంటూ సావిత్రమ్మ ఇంట్లోకి ప్రవేశించింది. హుషారుగా పాడుతున్న టేప్ రికార్డర్‌ని టక్కున ఆపేసింది ధనలక్ష్మి.

''మేము వెళ్ళే దారిలో ట్రేన్ వెనకాల ట్రేన్ గుద్దుకున్నాయి. ఈరోజు రెండువైపులా ట్రేన్లు నడవ్వు. అంచేత తిరిగి వచ్చాం. నిన్ను చూశాం. చాలా సంతోషం...''

శరత్ గబగబా ధనలక్ష్మిని మరో గదిలోకి లాక్కెళ్ళాడు.

''ఏమిటిది? ఓపిక లేదా నీకు? వెంటనే చీర కట్టుకో..'' అన్నాడు కోపంగా.

''తప్పయి పోయిందండీ..'' అన్నది ధనలక్ష్మి. ఆమె కళ్ళల్లో నీళ్ళు.

ధనలక్ష్మి చీరకట్టుకుంటూ వుంటే ''వద్దు. నువ్విప్పుడు ఎలా ఉన్నావో అలాగే ఉండు. అట్లాగే వంట చేసేయ్. ఆకలేస్తుంది. ఆరోజు బిర్యానీ చేశావు చూడూ..అదే చెయ్..'' అన్నది సావిత్రమ్మ.

ధనలక్ష్మికి గుండెల్లోంచి ఏడుపుతన్నుకొస్తోంది.

''ఒరేయ్! నువ్వీసారి వంటగదిలోకి వెళ్ళొద్దు. నా ఎదురుగా కూర్చో. నీ భార్య వంట చేయాలి. నేనది చూడాలి. అంతే...'' గట్టిగా కొడుకువైపు చూస్తూ ఆజ్ఞాపించింది.

''పద. వంటగదిలోకి..'' ధనలక్ష్మిని వెంటబెట్టుకుని వంటగది లోనికి వెళ్ళిందామె.

ధనలక్ష్మి నిజంగానే ఏడ్చేసింది. తనకు వంటరాదని మొత్తం కథంతా చెప్పేసింది.


సావిత్రమ్మ ధనలక్ష్మిని దగ్గరకు తీసుకుంది. ఆమె స్పర్శలో ప్రేమాప్యాయతలు ఉన్నాయ్.

''పిచ్చితల్లీ! ఒక్క అబద్ధానికి వెయ్యి అబద్ధాలు ఆడాలి. ఈకాలం ఆడపిల్లలు వంటచేయడం రాదని అదేదో పెద్ద డిగ్రీ పుచ్చుకున్నట్లు చెబుతారు. పైగా అత్తంటే వంటగదిలో కిరోసిన్ ఆయిల్‌పోసి తగలబెట్టే రాక్షసిలా చాలా మంది వూహించుకుంటున్నారు. భయపడుతున్నారు. కొందరు ఉండవచ్చు...కాదనను. కానీ, పెళ్ళవగానే అమ్మ దగ్గరున్న చనువులాగే అత్తయ్య దగ్గరెందుకు ఉండలేకపోతున్నారు?''

''ఒక స్త్రీ మరో స్త్రీని చూసి భయపడుతోంది. అనుమానిస్తోంది. అలా వద్దు. మనసారా అత్తగారిలో మీ తల్లిని చూడండి. అప్పుడు ఏ అత్త బాధపెట్టదు. కోడలిలో తన బిడ్డని చూసుకుంటుంది. కొందరి సంగతి వదిలేయ్. చూడూ. నీకు వంట రాదని భయంతో దాచిపెట్టావు. నువ్వు బాధ పడ్డావు. ఆ వెధవ కూడా బాధ పడ్డాడు. ఎందుకు? మీరిద్దరు నిజం దాచిపెట్టారు. అలా ఎప్పటికీ చేయకు. పెళ్ళయ్యాక తల్లి తర్వాత తల్లి లాంటిది అత్తగారంటే! మీలాంటి ఆడపిల్లలు యీ విషయం గుర్తుంచుకుంటే ఏ బెడదా ఉండదు.''

''రా. నేనింకా వారం రోజులుంటాను. నీకు వంట గదిలో అన్ని రకాల వంటలు చేయడం నేర్పిస్తాను. నీకో విషయం తెలుసా? ఇలాంటి పరిస్థితి రావచ్చని నా కొడుకులందరికీ నేనే వంట చేయడం నేర్పించా..''

అత్తగారు నవ్వుతూ ఉంటే ఆమెతో బాటు ధనలక్ష్మి కూడా తృప్తిగా నవ్వేసింది. ★



## సంయుక్త సినిమా!

షారుఖ్ ఖాన్ బాలీవుడ్‌కి వచ్చిన తొలి రోజుల్లో జూహీ చావ్లాతో కలిసి 'రాజా బన్ గయా జెంటిల్మాన్', 'డర్' లాంటి చిత్రాల్లో కలిసి నటించాడు. బహుశా ఆ దోస్తానాతోనో ఏమో ఇప్పుడు ఇద్దరూ కలిసి సంయుక్తంగా ఓ చిత్ర నిర్మాణ సంస్థని ఆరంభిస్తున్నారు. తొలి ప్రయత్నంగా 'ఫిర్ భీ దిల్ హై హిందుస్తానీ' అనే సినిమాని నిర్మిస్తున్నారు. ఈ ప్రొడక్షన్‌లో జూహీ వుడ్‌బీ 'జై మెహతా', దర్శకుడు అజీజ్ మీర్జా కూడా పార్ట్‌నర్స్‌గా వుంటున్నారట. ఓ హీరో ఓ హీరోయిన్ కలిసి సొంతంగా సినిమా తీస్తున్నారంటే ఆ సినిమాకి భలే క్రేజ్ ఏర్పడుతుంది. బిజినెస్ వర్గాల్లో మంచి ఆసక్తిని రేకెత్తిస్తుంది. ప్రస్తుతం జూహీ-షారుఖ్‌ల సంయుక్త సినిమా కూడా అలాగే ఆకర్షిస్తోంది.

-జె.ఎం.